క్లుప్తంగా

'గురుకుల' ప్రవేశ పరీక్షకు 50 మంది హాజరు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రవి

సత్యవేడు: నియోజకవర్గ కేంద్రంలోని ఎంజేపి ఏపీ బీసీడబ్ల్యూయుఆర్ బాలుర గురుకుల పాఠశాలలో 6,7,8,9 తరగతులలో ఖాళీల(బ్యాక్ లాగ్ సీట్లు) భర్తీకి నిర్వహించిన పరీక్షకు 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రవేశ పరీక్షకు 52 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షకు ఇద్దరు గైర్హాజరయ్యారు. కె.రేష్మా అబ్జర్వర్‌గా వ్యవహరించారు. ఎంఈఓ కే.రవి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

జోరుగా అడ్మిషన్లు



అడ్మిషన్ల కోసం విద్యార్థులతో వచ్చిన తల్లిదండ్రులు

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జెడ్పీ హైస్కూలులో అడ్మిషన్ల సంఖ్య పెరుగుతోంది. సోమ, మంగళవారాల్లో 45 మంది అడ్మిషన్లు పొందారని ప్రధానోపాధ్యాయులు రమణయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ, బడి బయట పిల్లలను గుర్తించి, వారందరినీ స్కూలులో చేర్పించేలా తల్లిదండ్రులను చైతన్యపరుస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా షేక్ జరీనా



సత్యవేడు: తహసీల్దార్‌గా షేక్ జరీనా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాళహస్తి నుంచి ఆమె బదిలీపై ఇక్కడికి రాగా, ఇక్కడ పనిచేస్తున్న శ్రీదేవి కేవీబీపురాని బదిలీ అయ్యారు. జరీనా మాట్లాడుతూ, మండలంలో ఈనెల 23 నుంచి నిర్వహించనున్న జగనన్న సురక్షను విజయవంతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. రెవెన్యూ సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.

ఎంఈఓ–2గా యుగంధర్ రాజు



పిచ్చాటూరు: మండల విద్యాశాఖ అధికారి–2గా యుగంధర్ రాజు మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. స్థానిక జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతి పొంది ఎంఈఓ–2 అయ్యారు. మండలంపై పూర్తి అవగాహన ఉందని, అందరి సహకారంతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తానని ఆయన చెప్పారు. ఆయనకు ఎంఈఓ హేమమాలిని, ఉపాధ్యాయులు స్వాగతం పలికారు.

రేణిగుంట ఎంఈఓ–2గా రంగనాధయ్య



రేణిగుంట: రేణిగుంట మండల విద్యాశాఖాధికారి–2గా మంగళవారం కె.రంగనాధయ్య బాధ్యతలు స్వీకరించారు. ఆయనను ఎంఈఓ ఇందిరాదేవి, పలువురు ఉపాధ్యాయులు, ఐఈఆర్‌టీ జేష్మ, సీఆర్‌పీలు సత్కరించారు.


గంగమ్మ జాతర ప్రారంభం



జాతర పూజల్లో కమిటీ సభ్యులు, భక్తులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పానగల్‌లో గంగమ్మ జాతర మంగళవారం ప్రారంభమైంది. ఆలయం వద్ద పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు. బుధవారం అమ్మవారి ఊరేగింపు, ఆలయం వద్ద నిలుపుదల, రాత్రి నిమజ్జనంతో జాతర పరిసమాప్తమవుతుంది.

రేణిగుంటలో..



అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

రేణిగుంట: మండలంలోని కుర్రకాల్వ పద్మనగర్‌లో మంగళవారం గంగమ్మజాతర వైభవంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ రాణెమ్మ, వైఎస్సార్‌సీపీ నేత కుర్రకాల్వ వేణు ముదిరాజ్ ఆధ్వర్యంలో జాతర సాగింది. ప్రజలు అమ్మవారిని వేపాకు, నిమ్మకాయలు, పూలతో విశేషంగా అలంకరించారు. పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. అన్నదానం చేశారు. ఎంపీటీసీ భాస్కర్, కుర్రకాల్వ మురళి, ఆలయ సభ్యులు శివమ్మ, పార్వతమ్మ, సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పులివల్లం అభివృద్ధికి కృషి

- విద్యుత్ స్తంభాల ఏర్పాటు, మురుగునీటి కాలువల నిర్మాణానికి చర్యలు
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదేశం



పులివల్లంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం: మండలంలోని పులివల్లం గ్రామ పంచాయతీలో విడతల వారీగా మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తానని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హామీ ఇచ్చారు. గ్రామంలోని వీధుల్లో అవసరమున్న చోట విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో ఏడీ చంద్రా నాయక్‌ను ఆదేశించారు. మంగళవారం కారిపాకం సచివాలయం పరిధిలోని పులివల్లం, బీఎస్‌పేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాలతో ముద్రించిన బుక్‌లెట్లను అందజేశారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

మురుగు కాలువలు నిర్మించాలని స్థానికుల వినతిపై ఎమ్మెల్యే స్పందించారు. కాలువల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవకిని ఆదేశించారు. అలాగే పలువురు ఇంటి స్థలాలు, పింఛన్ల మంజూరు చేయాలని కోరారు. బీఎస్‌పేటలో చేనేత మగ్గాల ద్వారా ఉపాధి పొందుతున్న కొందరికి నేతన్న నేస్తం పథకం అందడం నివేదించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం కోసం చక్కటి వేదికగా నిలుస్తోందన్నారు. ప్రతిపక్షాలైన టీడీపీ, జనసేన పార్టీలు వైఎస్సార్‌సీపీపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతం చేసి పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, సర్పంచ్ బాలకృష్ణ, ఎంపీటీసీ మధుసూదనరావు, జేసీఎస్ మండల కన్వీనర్ చిన్నా, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు శివారెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రమణయ్య, అనిల్, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, తహసీల్దార్ గౌరిశంకరరావు, సీడీపీఓ దేవకుమారి, ఏపీఓ భాస్కర్, ఏపీఎం తిరుమలరాజు, ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ. 6లక్షలు అందుకున్నాం



ఉమ్మడి కుటుంబంగా ఉన్న మాకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగేళ్లలో రూ. 6లక్షల లబ్ధి పొందాం. మాతో పాటు ఇద్దరు కుమారులు కలసి ఉన్నారు.. మాకు వైఎస్సార్ రైతు భరోసా, సున్నా వడ్డీ, పింఛన్ కానుక, జగనన్న విద్యా, వసతి దీవెనలు, వైఎస్సార్ నేతన్న నేస్తం ఇలా సంక్షేమ పథకాలు మేము అందుకున్నాం. జగనన్న ప్రభుత్వానికి మేము ఎప్పటికీ అండగా ఉంటాం.

-వై. శాంతియమ్మ దంపతులు, బీఎస్‌పేట

మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి



మా కుటుంబానికి రూ. 2.94లక్షలు జగనన్న ప్రభుత్వం లబ్ధి చేకూరింది. జగనన్న అమ్మఒడి ద్వారా రూ. 29వేలు, విద్యా దీవెన ద్వారా రూ.99వేలు, వసతి దీవెన ద్వారా రూ. 20వేలు, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ. 31984, పింఛన్ కానుక రూ.1,09,000, సున్నా వడ్డీ రూ. 5337లు అందుకున్నాం. గతంలో ఏ ప్రభుత్వం ఇంతగా సాయం చేయలేదు. ఇంత మేలు చేసిన జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు.

-ఎం.స్నేహలత దంపతులు, బీఎస్‌పేట

నేతన్నల కష్టాన్ని గుర్తెరిగిన సీఎం



నా కుటుంబానికి గత నాలుగేళ్లలో రూ. 2.29లక్షలు అందింది. మా పిల్లల చదువులకు విద్యా దీవెన, అమ్మఒడి ఎంతగానో ఉపయోగపడింది. నెలనెలా వస్తున్న పింఛన్ కానుకతో కుటుంబ పోషణకు అండగా నిలుస్తోంది. చేనేతల కష్టాన్ని గుర్తించి నేతన్న నేస్తంతో సంవత్సరానికి వస్తున్న రూ. 24వేలతో మా వృత్తిని కొనసాగించగలుగుతున్నాం. నేతన్నల కష్టాలను గుర్తించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటాం.

-ఎం. పద్మావతి దంపతులు, బీఎస్‌పేట

బాధ్యతగా 'జగనన్న సురక్ష'



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహారావు

బుచ్చినాయుడుకండ్రిగ: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా శ్రీకారం చుట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఎంపీడీఓ నరసింహారావు ఆదేశించారు. జగనన్న సురక్ష అమలుపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయాల సిబ్బంది, వలంటీర్లకు అవగాహన సమావేశం నిర్వహించి ఎంపీడీఓ మాట్లాడారు. ఈ నెల 23 నుంచి వారం రోజుల పాటు వలంటీర్లు వారి పరిధిలోని కుటుంబాలకు వెళ్లి పరిష్కారం కాని సమస్యలను నమోదు చేసి, వాటిని సచివాలయంలో తెలియజేయాలన్నారు. ఆయా సచివాలయాల పరిధిలో నమోదైన సమస్యల పరిష్కారానికి 1వ తేదీ నుంచి కృషి చేయాలన్నారు. దీనిపై పర్యవేక్షణకు మండల శాఖ అధికారులను నియమించామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాజశేఖర్, ఎంఎల్‌ఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాల పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో జగనన్న ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ డీవీ నరసింహారావు ఆదేశించారు. మంగళవారం ఆయన కారణి లోని జగనన్న లే అవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను హౌసింగ్ ఏఈ సుబ్రమణ్యంతో కలసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, మండలంలో 602 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యిందని, వివిధ దశల్లో ఉన్న 120 ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మునెమ్మ, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, సిబ్బంది యుగంధర్, దయాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో నిషాన్



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మత గురువులు

గూడూరురూరల్: పట్టణంలోని హజరత్ సయ్యద్ హాషీం హుస్సేనీ బాబా దర్గాలో నిషాన్ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువుల ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా లయన్ షేక్ రియాజ్ అహ్మద్ ఇంటి నుంచి ఫకీర్ల జరాబులతో నిషాన్‌ను ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకొచ్చి ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా ఆవరణలో దర్గా వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముజావర్ మ గ్దూమ్ అలీషా, మత గురువులు ఖమర్ అలీషా, మస్తాన్ అలీషా, కరిముల్లాషా, దర్గా కమిటీ ప్రతినిధులు ఇలియాజ్ అహ్మద్, సందాని బాషా, షానవాజ్, షబ్బీర్, యస్థానీ, గోల్డెన్ గౌస్, కరిముల్లా, సైదులు, జలీల్, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ



పిచ్చాటూరులో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

పిచ్చాటూరు: పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో చేస్తున్న ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ మంగళవారం ఉదయం పరిశీలించారు. ఉదయం 9 గంటలకు నాగలాపురం మండలం వేంబాక్కంలో చెరువు పూడికతీత పనులను, అనంతరం పిచ్చాటూరు అరణియార్‌లో పూడిక తీత పనులను, కూలీల హాజరు పట్టిను పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. వారికి గరిష్ట కూలి వచ్చేలా పనులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తొలుత పనులకు మార్కింగ్ ఇచ్చి కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. రైతులు మామిడి, పూల సాగు, పంట్ల తోటలను ఉపాధి హామీ పథకంలో సాగు చేసుకోవచ్చని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పిచ్చాటూరు ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఓ నాగభూషణమ్మ, నాగలాపురం ఏపీఓ సుధాకరుడు, టీఏ పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

తారక్‌నాథ్‌కు ఘన నివాళి



తారక్‌నాథ్ చిత్రపటం ముందు నివాళులు అర్పిస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు కామ్రేడ్ తారక్‌నాథ్ 19వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను ఉద్యోగులు స్మరించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ స్వప్నప్రియ, మునెయ్య, పలువురు ఉద్యోగులు, యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా పుష్కరిణిలు



కోనేరువద్ద పరిశీలిస్తున్న అంజూరు, ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని నారద, వైష్ణవ పుష్కరిణిలను మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నూకరత్నం పరిశీలించారు. అంజూరు మాట్లాడుతూ, ఆధ్మాతికత ఉట్టిపడేలా పుష్కరిణిలను తీర్చిదిద్ది మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ప్రతిరోజూ సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు వేదిక ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు, పట్టణ ప్రజలు సేద తీరేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. అవసరమైన అంచనాలు సిద్ధం చేసి టెండర్లు ఆహ్వానించాలని అధికారులను ఆదేశించారు.

సింహ వాహనంపై పరాశరేశ్వరుడు



చంద్రప్రభ వాహనంపై పరాశరేశ్వరస్వామి

నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో మంగళవారం సాయంత్రం సింహ వాహనాన్ని ఉత్సవ మూర్తులు అధిరోహించి భక్తులను కటాక్షించారు. ఉదయం ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కైంకర్యాలు, పరివార దేవతలకు అభిషేకాలను నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. 10 గంటలకు చంపకవల్లీ, పరాశరేశ్వరునికి స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం కైంకర్యాలను అందుకున్న ఉత్సవమూర్తులు సింహవాహనాన్ని అధిరోహించారు. సర్కారు హారతి అందుకున్న దేవేరులు గ్రామోత్సవంలో భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, జమేదార్ రాజశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పేరిట కార్పొరేట్ స్కూళ్ల దోపిడీ



మాట్లాడుతున్న జాకీర్

శ్రీకాళహస్తి: పాఠ్య పుస్తకాల పేరిట కార్పొరేట్ స్కూళ్లు విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయని పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి జాకీర్ విమర్శించారు. పట్టణంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. తిరుపతి, శ్రీకాళహస్తి, రేణిగుంట, పుత్తూరు ప్రాంతాల్లో ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా పాఠ్యపుస్తకాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద వేలాది రూపాయలు గుంజుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కానుక పేరిట ఒక్కో విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, వర్క్ బుక్కులు, మూడు జతల యూనిఫాం, ఒక జత షూస్ తదితర వాటితో కలిపి రూ.2,400 ఖర్చు చేస్తోందన్నారు. అదే కార్పొరేట్ పాఠశాలలు కేవలం పుస్తకాలకే రూ.6వేలు నుంచి రూ.10వేలు వరకు వసూలు చేస్తున్నాయన్నారు. మిగిలినవి అదనమన్నారు. దీనిని విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా స్పందించి ఈ దోపిడీకి అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ముబషీర్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్‌కు కన్నీటి వీడ్కోలు



అమానుల్లా పార్థివ దేహాన్ని తీసుకెళుతున్న దృశ్యం

రేణిగుంట: స్థానిక బుగ్గవీధికి చెందిన వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ అమానుల్లాకు మంగళవారం కన్నీటి వీడ్కోలు పలికారు. గుండెపోటుతో ఆయన హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో మృతి చెందారు. మంగళవారం ఆయ భౌతికకాయాన్ని బుగ్గవీధిలోని ఆయన ఇంటికి తీసుకొచ్చారు. రేణిగుంట ముస్లిం మైనారిటీ నేతగా, మాజీ ఎంపీటీసీగా, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకునిగా ఆయన పట్టణవాసులకు సుపరిచితులు కావడంతో ఆయన అంతిమయాత్రకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ తిరుమలరెడ్డి, హైకోర్టు న్యాయవాది పేరూరు మునిరెడ్డి, రేణిగుంట సర్పంచ్ నగేషం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, కో–ఆప్షన్ సభ్యుడు సుభాన్‌రాజ, ముస్లిం మైనారిటీ జిల్లా అధ్యక్షుడు రసూల్ తదితరులు ఆయనకు ఘన నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఆణిముత్యాలకు సన్మానం





ఏర్పేడులో విద్యార్థులకు చెక్కులు, ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేస్తున్న సునీత, బండారుపల్లెలో..

ఏర్పేడు: ఏర్పేడు, బండారుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు సాయిపూజిత,కు ప్రథమ బహుమతిగా రూ.3 వేలు, జ్యోత్స్న, సానియాకు ద్వితీయ బహుమతిగా రూ.2 వేలు, పద్మశ్రీకు తృతీయ బహుమతిగా రూ.1000 చెక్కుతో పాటు ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. అలాగే బండారుపల్లెలో ముగ్గురు విద్యార్థులకు ఇదే రీతిలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తిరుపతి జనార్ధన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సునీత, నిర్మల్ కుమార్, వెంకటరమణ, ఉపాధ్యాయులు గుణశేఖర్‌రెడ్డి, శ్రీరాములు, సుబోస్, అనూరాధ, శ్రీదేవి, ద్వారకనాథ్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, సీఆర్పీలు మునీశ్వర్, వెంకటముని, విద్యార్థులు పాల్గొన్నారు.

'స్పందన' ఫిర్యాదుపై జిల్లా అధికారి విచారణ



గ్రామస్తులను విచారణ చేస్తున్న చెన్నయ్య

నారాయణవనం: కుల ధ్రువీకరణ సర్టిఫికెట్‌ను జారీ చేయడం లేదని స్పందనలో యువకుడు ఇచ్చిన అర్జీకి జిల్లా స్థాయి అధికారి స్పందించారు. విచారణ నిమిత్తం వచ్చిన సంఘటన మండలంలోని సముదాయంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. 60 ఏళ్ల క్రితం తమిళనాడు నుంచి వలస వచ్చిన తమకు గణిక కుల ధ్రువపత్రాలను రెవెన్యూ అధికారులు జారీ చేయడం లేదని పుత్తూరుకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ మురళీధర్ స్పందనలో అర్జీ ఇచ్చారు. స్పందించిన కలెక్టర్ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్యను విచారణ అధికారిగా నియమించారు. మంగళవారం మురళీధర్ తాత నివాసమున్న సముదాయం గ్రామంలోని బంధువులను, వృద్ధులను చెన్నయ్య విచారణ చేశారు. యువకుని కుటుంబ పెద్దలు చదివిన సముదాయంలో ప్రాథమిక పాఠశాల, నారాయణవనంలో బాలుర హైస్కూలు (అప్పట్లో ఉన్నత పాఠశాల)ల్లో రికార్డులను పరిశీలించారు.

దశాబ్దాల సమస్య

గణిక కుల సమస్యపై దశాబ్ద కాలంగా పోరాటం చేస్తున్నారు. గతంలో గణిక కుల పత్రాలను రెవెన్యూ అధికారులు ఆక్షేపణ లేకుండా జారీ చేసేవారు. కాలానుగుణంగా కులాల పేర్లలో మార్పులు రావడంతో సమస్య ఉత్పన్నమైంది. ఆచార వ్యవహారాలను దృష్టిలో ఉంచుకుని సూర్య బలిజగా కుల ధ్రువ పత్రాలను జారీ చేయాలని రెవెన్యూ అధికారులకు గణిక కులస్తులు దరఖాస్తు చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు తిరస్కరించడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గణికులు కుల ధ్రువపత్రాల కోసం రెవెన్యూ అధికారులపై ఒత్తిడి పెంచారు. పలుమార్లు జిల్లా, రాష్ట్ర స్థాయిలో అధికారులకు వినతి పత్రాలను సమర్పించినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. నారాయణవనం మండలం సముదాయం నుంచి పుత్తూరుకు ఉద్యోగ రీత్యా వలస వచ్చిన రెవెన్యూ ఉద్యోగి నరసింహులు కుమారుడు మురళీధరన్ పట్టువీడని విక్రమార్కునిలా పలుమార్లు వినతి పత్రాలను సమర్పించడంతో కలెక్టర్ స్పందించి, క్షేత్ర స్థాయి విచారణకు ఆదేశించారు. బీసీ వెల్ఫేర్ డీడీ చెన్నయ్య విచారణ అధికారి హోదాలో మంగళవారం విచారణ చేశారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నారు.

విచారణ తొలి విజయం



గణిక స్థానంలో సూర్య బలిజ కుల ధ్రువీకరణ పత్రం కోసం చేస్తున్న పోరాట విజయానికి విచారణతో నాంది పలికినట్లైంది. పూర్తి స్థాయిలో కుల సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను గుర్తించి కుల ధ్రువీకరణ పత్రాలను ప్రభుత్వ గెజిట్ మేరకు జారీ చేయించడానికి కలెక్టర్ ఆదేశాలు ఇవ్వాలని ఆశిస్తున్నా.

-మురళీధర్, పుత్తూరు